మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే... 5 PM
మంగళవారం, 29, సెప్టెంబర్, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## 'సర్' తర్వాత జరిగే
# తొలి ఎన్నిక!




**హైదరాబాద్ :** వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఖైరతాబాద్ ఉప ఎన్నికను సెమీఫైనల్‌గా భావిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు, తమ రాజకీయ చతురతను తేల్చు కోవడానికి సిద్ధం అవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ గెలిచిన కాంగ్రెస్, ఖైరతాబాద్‌లోనూ విజయం సాధించి హైదరాబాద్ నగరంలో పట్టును నిరూపించుకోవాలన్న వ్యూహంతో ఉంది.గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్‌ను గెలుచుకున్న బీఆర్?ఎస్ తిరిగి ఈ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా రాష్ట్ర రాజకీయాలకు బలంగా ఓ సంకేతాన్ని పంపాలని భావిస్తోంది. తెలంగాణలో అధికారం సాధించే దిశగా ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్న బీజేపీ ఉప ఎన్నికలో గెలిచి కేడర్‌ను ఉత్సాహపరచాలని ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత జరిగే మొదటి ఎన్నిక కావడంతో ఈ రకంగా కూడా దీనికి ఎక్కువగా ప్రాధాన్యం ఏర్పడింది. ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు గెజిట్ నోటిఫికేషన్ వెలువడినందున త్వరలోనే ఇక్కడ ఎన్నిక ఉండొచ్చని రాజకీయ పార్టీలు అంచనా వేసుకుంటున్నాయి.

# రాముడు-శివుడిపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్

## జాతీయ రాజకీయాల్లో దుమారం

- ఉత్తర, దక్షిణ భారతదేశంపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలతో వివాదం
- తాము ద్రావిడులమని, శివభక్తులమని ఉత్తరాది వారు ఆర్యులని, రామభక్తులని వ్యాఖ్య
- హిందువులను విడదీసేందుకే రేవంత్ మాట్లాడుతున్నారని బీజేపీ ఆరోపణ
- రాహుల్ గాంధీ ఆదేశాలతోనే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారని బీజేపీ విమర్శ



**హైదరాబాద్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజల మధ్య మత, రాజకీయ పరమైన గుర్తింపులపై ఆయన చేసిన విశ్లేషణ పెద్ద వివాదానికి దారితీసింది. రాజకీయ లబ్ధి కోసం రేవంత్ రెడ్డి సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. జాతీయ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, బీజేపీ నినాదాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతలు పదే పదే 'జై శ్రీరామ్' అని ఎందుకు అంటారని, అదే తరహాలో 'హర హర మహాదేవ్' అని ఎందుకు నినదించరని ఆయన ప్రశ్నించారు."మేం ద్రావిడులం. ఇక్కడి (ఉత్తర భారతదేశం) ప్రజలు ఆర్యులు. మేం శివ భక్తులం, ఇక్కడి ప్రజలు శ్రీరాముడి భక్తులు. బీజేపీ రాముడిని దొంగిలించింది. అది ఒక భావోద్వేగం. మోదీ గారు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనరు? బీజేపీ నేతలు వేదికపై ఆ నినాదం చేయడం మీరు ఎప్పుడైనా చూశారా? వాళ్లు కేవలం 'జై శ్రీరామ్' అంటారు. మేం 'హర హర మహాదేవ్' అంటే వారికి నచ్చదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. శివుడిని 'పేదల దేవుడు' అని, రాముడిని 'ధనవంతుల దేవుడు' అని అభివర్ణించిన ఆయన, ఇద్దరు దేవుళ్లను ప్రజలు ఆరాధిస్తారని కూడా స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశ రాజకీయ సంస్కృతులు, సామాజిక గుర్తింపుల మధ్య విస్తృతమైన తేడాలు ఉన్నాయనే వాదనకు బలం చేకూర్చే క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# దేవుడిని రాజకీయాలకు ఉపయోగించుకోవడం సరికాదు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 29 :** దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం ఎవరికీ మంచిది కాదని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరికీ తమ తమ దేవుళ్లపై విశ్వాసం ఉంటుందని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు శివుడు ఆరాధ్య దైవమని ఉద్ఘాటించారు.ఇతరుల విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్న విషయం ఇదేనని తెలిపారు. దేవుడిని రాజకీయాలకు ఉపయోగించుకోవడం సరికాదని అన్నారు. దేవాలయాలను అభివృద్ధి చేయడం తమ బాధ్యత అని చెప్పుకొచ్చారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయస్వామి ఇలా అన్ని దేవాలయాలపై తమకు గౌరవం, విశ్వాసం ఉందని వివరించారు. ప్రజల విశ్వాసాన్ని గౌరవిస్తూ, ఆలయాలను అభివృద్ధి చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ వివాదంపై
# కాంగ్రెస్ కీలక భేటీ



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం వ్యవహారశైలి, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) మంగళవారం ఢిల్లీలో సమావేశమైంది. ఎన్నికల సంఘం పనితీరు, ఎస్ఐఆర్ అమలు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించిన అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నారు. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందించడంపైనా కాంగ్రెస్ దృష్టి సారించింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరుగుతున్న ఈ భేటీకి మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ తదితరులు హాజరయ్యారు.

## డాక్టర్ భాస్కర్ కేసు.. నిమ్స్ ఉద్యోగుల ఇళ్లలో
# ఏసీబీ తనిఖీలు




**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని నిమ్స్ (నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నూరి లక్ష్మీ భాస్కర్ అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా ఈ ఉదయం నిమ్స్‌లోని పలువురు ఉద్యోగుల ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవల అరెస్ట్ అయిన డాక్టర్ భాస్కర్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో, ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. గతంలో ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీల ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఏసీబీ ప్రాథమిక అంచనాల ప్రకారం, ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల పత్రాల విలువ రూ.6.13 కోట్లుగా ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు, జాగ్వార్, ఆడి, టాటా నెక్సాన్ వంటి లగ్జరీ కార్లతో పాటు పలు ఫ్లాట్లు, విశాఖపట్నం సహా తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లను గుర్తించారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ కసరత్తు పూర్తి..
# అధిష్ఠానానికి ఆరుగురి పేర్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 29:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కసరత్తును తెలంగాణ కాంగ్రెస్ పూర్తి చేసింది. రెండు స్థానాలకు జాబితాను సిద్ధం చేసిన టీపీసీసీ.. దాన్ని అధిష్ఠానానికి పంపించింది. సామాజిక సమీకరణాల వారిగా జాబితాను టీపీసీసీ రూపొందించింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి తుది జాబితాలో ముగ్గురికి చోటు కల్పించింది. ఓసీ, బీసీ, ఎస్సీ సామాజికవర్గాల నుంచి ఒక్కో పేరును అధిష్ఠానానికి టీపీసీసీ పంపించింది.మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, సామ రామ్మోహన్ రెడ్డి, గౌరీ సతీష్ పేర్లతో కూడిన జాబితాను పంపగా. ఈ ముగ్గురిలో ఒకరి పేరును ఏఐసీసీ ఫైనల్ చేయనుంది. అలాగే, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి ముగ్గురు పేర్లతో జాబితాను టీపీసీసీ సిద్ధం చేసింది. ఈ స్థానా నికి ఇద్దరు ఓసీ, ఒక బీసీ పేర్లతో జాబితాను రెడీ చేసి అధిష్ఠానానికి పంపించింది. ప్రస్తుత ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్, సూర్యాపేటకు చెందిన సర్వోత్తమ్ రెడ్డి, ఓయూకు చెందిన పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ పేర్లతో జాబితా రూపొందించింది.ఈ ముగ్గురిలో ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశం లభించనుంది. ఇక, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టికెట్ ఎవరికి ఇచ్చినా అందరూ సహకరించాలని నేతలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేయనున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం పేర్లను ప్రకటించక ముందే ఆశావహులతో టీపీసీసీ చీఫ్ భేటీ అవనున్నారు.

## బుల్లెట్ ట్రైన్ పేరుతో
# రియల్ ఎస్టేట్ దందా



**హైదరాబాద్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రభుత్వ భూమి ఉండగా రైతుల భూములు ఎందుకని ప్రశ్నబుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ కుంభకోణానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీ అభివృద్ధికి గానీ, బుల్లెట్ ట్రైన్‌కు గానీ వ్యతిరేకం కాదని, కానీ దాని ముసుగులో రైతుల భూములను లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.శంషాబాద్ విమానాశ్రయం వద్ద వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా, తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న బహదూర్‌పల్లి వ్యవసాయ భూములను ఎందుకు సేకరిస్తున్నారని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక రైల్వే స్టేషన్ కోసం వెయ్యి ఎకరాలు అవసరమా? అని నిలదీశారు. రైతుల భూములపై సుమారు 4,000 మంది పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వం వద్ద సరైన పత్రాలు ఉంటే వాటిని రైతులకు చూపించాలి, అంతేకానీ పోలీసులను పెట్టి భయపెట్టడం ఎందుకు?" అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు."ఏడాదిన్నరలో మీ ఆశీస్సులతో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారు. మీ పట్టాలు మీకే ఇప్పిస్తాం. మీకోసం హైకోర్టుకు వెళ్లిన కార్తీక్ రెడ్డి ద్వారానే మీకు పట్టాలు అందేలా చూస్తాం," అని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులు అధైర్యపడొద్దని, ఐక్యంగా ఉండాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా, న్యాయపరంగా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# జనగాంలో నూతన స్వచ్ఛ ఆటోల ర్యాలీ ఘనంగా ప్రారంభం





**జనగాం, సెప్టెంబర్ 29 (ప్రజావాణి న్యూస్):**
జనగాం మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు నూతనంగా అందుబాటులోకి వచ్చిన స్వచ్ఛ ఆటోల ర్యాలీని ఘనంగా నిర్వహించారు.మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీకి మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, కమిషనర్ రాజశేఖర్ రెడ్డి లు జెండా ఊపి ప్రారంభించారు. నూతన స్వచ్ఛ ఆటోలకు పూలమాలలు వేసి, పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించారు.డి, పొడి చెత్త వేరు చేయాలని అవగాహనఈ సందర్భంగా ప్రతి వార్డులో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొని నూతన స్వచ్ఛ ఆటోల ర్యాలీని విజయవంతం చేశారు.పరిశుభ్రమైన జనగాం – స్వచ్ఛ జనగాం లక్ష్యంఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ మాట్లాడుతూ, "పరిశుభ్రమైన జనగాం -- స్వచ్ఛ జనగాం" లక్ష్యంగా మున్సిపాలిటీ నిరంతరం పనిచేస్తోందని, ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరించి తమ ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు.

# మన హృదయం...... మన బాధ్యత

**రేబర్తిలో ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం**

**గ్రామ సర్పంచ్ నిరాటి శ్రీనివాస్**



**మద్దూరు సెప్టెంబర్ 29, ప్రజా వాణి,**
మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ నిరాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గుండె జబ్బులపై ప్రజలు అవగాహన కలిగి ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవడం ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అదే విధంగా ప్రతి రోజు కొంత సేపు నడక వ్యాయామం ఆరోగ్య కరమైన ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. దీంతో పాటు ఉప్పు, అధిక కొవ్వు పదార్థాలు తగ్గించడం, ధూమపానం, పొగాకు లాంటి పదార్థాలకు దూరంగా ఉండడం, రక్త పోటు, షుగర్, కొలెస్ట్రాల్ క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవాలన్నారు. మన గుండెను కాపాడుకుందాం...ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుదామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్, జి పి ఓ,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుల్లూరి రాజు, ఆశా కార్యకర్తలు,గ్రామస్థులు,మహిళలుపాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని నడపలేక, హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్న మైఖ్యమంత్రి : శ్రవణ్,మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్,

**కాప్రా ప్రతినిధి వెంకటేష్ గౌడ్ సెప్టెంబర్ 29 (ప్రజావాణి ప్రతినిధి)**
రాష్ట్రాన్ని సమర్థవంతంగా నడపలేక, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని మల్కాజ్‌గిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ విమర్శించారు.శివపురిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో తాము సంయమనంతో వ్యవహరిస్తున్నప్పటికీ, ముఖ్యమంత్రి మాత్రం హద్దులు దాటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు.తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పదేపదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. చివరకు శివుడు, విష్ణువు మధ్య కూడా విభేదాలు సృష్టించే విధంగా వ్యాఖ్యలు చేయడం ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నంగా కనిపిస్తోందని విమర్శించారు."శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే" అని శాస్త్రాలు శివుడు, విష్ణువు మధ్య అభేదాన్ని చెబుతున్నాయని, అలాంటి ఆధ్యాత్మిక సంప్రదాయం ఉన్న దేశంలో ఉత్తర భారతీయులు రామ భక్తులు, దక్షిణ భారతీయులు శివ భక్తులు అంటూ ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం



సమంజసం కాదన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన పెన్షన్లు, మహిళలకు ఆర్థిక భృతి, నిరుద్యోగ భృతి, స్కూటీలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వంటి హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని శ్రవణ్ డిమాండ్ చేశారు.తెలంగాణలో గణనీయమైన జనాభా, ఆర్థిక ప్రాధాన్యత కలిగిన హైదరాబాద్ నగరాన్ని మూడు భాగాలుగా విభజించి, ప్రజలకు అందుబాటులో లేని పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేశారని ఆయన విమర్శిం చారు.హైదరాబాద్ నగరంలో కనీసం రోడ్లపై గుంతలను పూడ్చ లేని పరిస్థితి నెలకొందని, ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందిం చడంలో కూడా ప్రభుత్వం ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. గత కొన్ని నెలలుగా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మురుగు నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత విమర్శలు, రాజకీయ ఆరోపణలకు బదు లుగా రాష్ట్ర పరిపాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీ లను అమలు చేయాలని శ్రవణ్ హితవు పలికారు.ఈ కార్య క్రమంలో డివిజన్ అధ్యక్షులు నందు యాదవ్, మాజీ కౌన్సిలర్ లీలావతి, మురళి గౌడ్, జోగు వెంకటేష్, ఆనంద్ పాల్గొన్నారు.

# పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**-- చింతల రజనీకాంత్**



**నడికుడ, సెప్టెంబర్ 29 (ప్రజావాణి):** ఉమ్మడి వరంగల్––నల్గొండ––ఖమ్మం జిల్లాల పరిధిలోని అర్హత కలిగిన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నడికుడ మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతల రజనీకాంత్ పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందస్తుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమైనదని, అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు బాధ్యతగా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.పట్టభద్రులలో ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించేందుకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని చింతల రజనీకాంత్ కోరారు.

# అయ్యా అధికారులారా... ఒకసారి పెద్ద శంకరంపేట వైపు చూడండి! చెత్తతో నరకమైపోయిన ఊరు - రోగాల బారిన పడుతున్న ప్రజలు - కన్నీటిలో మా మత్స్యకారుల బతుకులు







**పెద్ద శంకరంపేట, ప్రజావాణి ప్రతినిధి: బాలరాజు**
ఊరు ఏడుస్తోంది అయ్యా...
మెదక్ జిల్లాలోనే పెద్ద శంకరంపేట మండల కేంద్రం, ఎంతో అభివృద్ధి చెందాల్సిన పెద్ద శంకరంపేట నేడు కన్నీరు పెడుతోంది. పొద్దున్నే లేచి భగవంతుడిని తలుచుకోవాల్సిన ప్రజలు, ముక్కు మూసుకుని చెత్త దుర్గంధాన్ని భరిస్తూ బతుకుతున్నారు.
మమ్మల్ని కాపాడాల్సిన పంచాయతీయే మా పాలిట శాపమా?
ఇది నిజంగా చాలా బాధాకరం అయ్యా. ప్రతి రోజు పొద్దున్నే పంచాయతీ ట్రాక్టర్ వస్తుంది, ఇంటింటి చెత్తను తీసుకుంటుంది. ప్రజలు అనుకుంటారు – "అమ్మయ్య, మా ఊరు శుభ్రంగా అవుతోంది" అని. కానీ ఆ ట్రాక్టర్ ఎక్కడికి వెళ్తుందో తెలుసా?మా ఊరి పిల్లలు స్కూల్ కు వెళ్లే నాడీ రోడ్డు పక్కన, మా రైతులు పొలాలకు వెళ్లే దారిలో, మా ఆడబిడ్డలు నడిచే నడి రోడ్డుపై ఆ చెత్తను కుప్పగా పోసి వెళ్తోంది.
ఈ దృశ్యం చూస్తే కడుపు తరుక్కుపోతోంది...
రోడ్డు పక్కన ప్లాస్టిక్ కవర్లు గాలికి ఎగురుతున్నాయి, కుళ్లిన చెత్త నుండి పురుగులు వస్తున్నాయి, భరించలేని వాసన. ఆ దారి వెంట వెళ్లే చిన్న పిల్లలు వాంతులు చేసుకుంటున్నారు. గర్భిణీ స్త్రీలు ఆ దారిలో నడవలేకపోతున్నారు.అయ్యా, ప్రజలకు అండగా ఉండాల్సిన గ్రామ పంచాయతీ ఇలా చేస్తే, ఇక ప్రజలు ఎవరికి చెప్పుకోవాలి? మేము రోడ్డు పక్కన చెత్త వేయొద్దంటే, పంచాయతీ వారే వేస్తుంటే మా బాధ ఎవరికి చెప్పుకోవాలి?
భయం – రోగాల భయం – పిల్లలకు, పెద్దలకు ప్రాణ సంకటం!అయ్యా, ఇది కేవలం దుర్గంధం సమస్య కాదు, ఇది ప్రాణాల సమస్య.దోమల బెడద – డెంగ్యూ, మలేరియా,రోడ్డు పక్కన కుళ్లిన చెత్త, చెరువులో కుళ్లిన చికెన్ వ్యర్థాలతో దోమలు లక్షల్లో పెరిగిపోయాయి. సాయంత్రం అయితే ఇంట్లో ఉండలేని పరిస్థితి. చిన్న పిల్లలకు డెంగ్యూ, మలేరియా జ్వరాలు వస్తున్నాయి. గత నెలలోనే 10 మందికి పైగా జ్వరాలతో ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్లారు.చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు: చెత్త నుండి వచ్చే దుర్గంధంతో, ఈగలతో చర్మంపై దద్దుర్లు, దురదలు వస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు దగ్గు, ఆయాసంతో బాధపడుతున్నారు.వాంతులు, విరేచనాలు చెరువు నీరు కలుషితమై, ఆ నీటి ఆవిరితో, ఈగలతో ఆహారం కలుషితమై వాంతులు, విరేచనాలు అవుతున్నాయి."మా పిల్లలకు రోగాలు వస్తే మేము ఎక్కడికి పోవాలి? ప్రభుత్వ హాస్పిటల్ లో మందులు లేవు, ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్తే 5 వేలు అయిపోతోంది" అని ఒక తల్లి కన్నీటితో చెబుతుంటే చూసే వారికి గుండె తరుక్కుపోతోంది.మా చిన్న కోరిక ఒక్కటే:"అయ్యా, దయచేసి ఊరి దగ్గర చెత్త వేయొద్దు. పెద్ద శంకరంపేట శివారు అవతల ప్రాంతంలో, ఎవరూ నివసించని దూర ప్రాంతంలో ఒక శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయండి. మా ఊరిని కాపాడండి" అని ప్రతి ఒక్క తల్లి, ప్రతి ఒక్క తండ్రి వేడుకుంటున్నారు.ఇది ఏ ఒక్క అధికారిని ఉద్దేశించి మాట్లాడింది కాదు అయ్యా, ఇది ప్రతి ఒక్క అధికారి – సర్పంచ్ గారు, కార్యదర్శి, వీఆణూ అందరూ ముందుండి చేయాల్సిన పని.మత్స్యకారుల కథ – పెట్టుబడి కూడా రాక అప్పుల పాలైన బతుకులుమా చెరువు కథ. మా పెద్ద శంకరంపేట పెద్ద చెరువు... ఒకప్పుడు నిండుగా నీటితో, చేపలతో కళకళలాడేది. ఆ చెరువుపై 140 మత్స్యకార కుటుంబాలు బతుకుతున్నాయి.ప్రతి సంవత్సరం, ఆ మత్స్యకారులు తమ భార్యల బంగారాన్ని తాకట్టు పెట్టి, వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు తెచ్చి, రూ. లక్ష, లక్షన్నర పెట్టి చేప పిల్లలను చెరువులో వదులుతారు. "ఈసారైనా పంట బాగా వచ్చి, పిల్లలకు మంచి బట్టలు కొనాలి, అప్పులు తీర్చాలి" అని కలలు కంటారు.కానీ ఏం జరుగుతోంది? రాత్రికి రాత్రి కొందరు చికెన్ సెంటర్ వాళ్లు కోళ్ల పేగులు, రక్తం, ఈకలు, కుళ్లిన మాంసం వ్యర్థాలను తెచ్చి మా చెరువులో గుమ్మరిస్తున్నారు. చెరువు నీరు నల్లగా, విషంగా మారిపోతోంది. చేపలు ఉక్కిరిబిక్కిరి అయి చనిపోయి నీటిపై తేలుతున్నాయి.మత్స్యకారన్న కన్నీళ్లు పెట్టుకుని పాలవుతున్నాం అన్నా. ఈ చెరువు మా పాలిట శాపంగా మారింది అన్నా. మా పిల్లలకు స్కూల్ ఫీజు కట్టలేకపోతున్నాం. ఇది ఏ అధికారిని తిట్టడం కాదు మా బతుకులు కాపాడమని అడుగుతున్నాం"అధికారులు వెంటనే స్పందించాలి, లేనియెడల కలెక్టర్ గారి దగ్గరకు వెళ్తాంఇన్నిరోజులు ఓపిక పట్టాం. ఇక ఓపిక నశించింది. అందుకే గ్రామ ప్రజలు, మత్స్యకారులు, యువకులు, మహిళలు అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు.
అయ్యా అధికారులారా, మీరు ఈ వారం రోజుల్లో స్పందించి, నాడీ రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించి, ఊరి శివారు అవతల డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి, చెరువులో చికెన్ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోకపోతే, మేము చేసేది ఒక్కటే..."మేమందరం కలిసి, మా పిల్లలతో, మా కుటుంబాలతో మెదక్ కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లి కలెక్టర్ గారికి వినతి పత్రం ఇస్తాం. మా బాధను కలెక్టర్ గారికి చెప్పుకుంటాం. అయ్యా, ఇది బతుకు కోసం, మా పిల్లల ఆరోగ్యం కోసం చేసే పోరాటం.జిల్లా పంచాయతీ అధికారి గారికి విజ్ఞప్తి:
అయ్యా, ఒకసారి పెద్ద శంకరంపేట వైపు చూడండి. మా ఊరిని కాపాడండి. శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయండి. మా చెరువును, మా మత్స్యకారుల బతుకులను, మా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడండి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

# సంగెం మండల ఎస్సై వంశీకృష్ణకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

**ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా ఇన్చార్జి: చాతల్ల రమేష్ మాదిగ**




**ప్రజావాణి హనుమకొండ నవీన్ బ్యూరో**
సంగెం సెప్టెంబర్ 28: సంగెం మండల ఎస్సై వంశీకృష్ణకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పక్షాన చాతాళ్ల రమేష్ మాదిగ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు భరోసా కల్పిస్తూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ విధి నిర్వహణలో నిబద్ధతతో ముందుకు సాగుతున్న ఎస్సై వంశీకృష్ణ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందిస్తున్నారని అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువస్తున్నారని కొనియాడారు.ఎస్సై వంశీకృష్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. ఆయన జన్మదినం జీవితంలో మరెన్నో విజయాలకు నాంది కావాలని చాతాళ్ల రమేష్ మాదిగ కోరారు.

# కుసుమ విత్తనాల పంపిణీ

**- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**ప్రజా వాణి,న్యూస్ వికారాబాద్ జిల్లా**



కుసుమ పంట సాగు చేసుకునే రైతులకు సోమవారం వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులు విత్తనాలు పంపిణీ చేశారు.వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలంలోని రైతు వేదికల క్లస్టర్ల రైతులు కుసుమ విత్తనాలను తీసుకెళ్లారు. ఎకరానికి నాలుగు కిలో బస్తా విత్తనాల ప్యాకెట్లు రైతులకు అందజేశారు. ఎకరాలకు మించి కుసుమ విత్తనాల ప్యాకెట్లు ఇవ్వడం లేదన్నారు.ఆసక్తిగల రైతులు ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్ కాపీతో రైతు వేదికకు ముందు రాపిచుకున్న రైతు లకు ఉచితంగా విత్తనాలను ఇవ్వనున్నట్లు ఏవో జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.మండలానికి 17 క్వింటాలా కుసుమ లు వచ్చాయి ఎకరాకు 4 కిలోల బస్తా ఇవ్వడం జరుగుతుందని అన్నారు.కుసుమ సాగులో అధిక సాంద్రత పద్ధతి, సింగిల్ పీకింగ్ అనేది తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే సరికొత్త విప్లవాత్మక విధానం వ్యవసాయ రంగంలో వచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో స్థానిక సర్పంచి నరసింహారెడ్డి, సొసైటీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ రామ్ రెడ్డి, సర్పంచులు జగన్ రెడ్డి, శేఖర్, సంతోష్ రెడ్డి, సామెల్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ప్రకాశం, నాగిరెడ్డి, ఖదీర్,నరసింహారెడ్డి, పరమేశ్వర్, రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో)లు లక్ష్మి, ఆదిల్, పవన్, లోకేశ్వర్, రాజు, వివిధ పార్టీల నాయకులు అందే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దూరులో విధికుక్కల స్వైర విహారం

**.భయాందోళనలో చిన్నారులు..వృద్ధులు**

**పట్టించుకోని అధికారులు... ప్రజా ప్రతినిధులు**

**మద్దూరు సెప్టెంబర్ 29, ప్రజా వాణి,**
మద్దూరు మండల కేంద్రంలో విధికుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తుండడంతో చిన్నారులు.. వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి పూట బయటికి రావాలంటే గ్రామ ప్రజలు జంకుతున్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను సైతం కరవడం కోసం దాడికి దిగుతున్న



నియంత్రించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.చిన్నారులు ఉదయం పూట పాఠశాలకు వెళ్లాలంటే భయంతో ఇంట్లోనే ఉండిపోవడం జరుగుతుందని పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు. కిరాణా షాపుల వద్ద 50నుండి 60 కుక్కలు గుంపులు కూడి ఉండడంతో షాపు యజమానులు షాపులు మూసి వేసి తలుపులు వేసుకొని ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే విధి కుక్కలను నియంత్రించి వాటినుండి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com